క్లుప్తంగా

గ్రామాలపై నిఘా పెంచండి



సి.బెళగల్‌లో మహిళా కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పీరయ్య

సి.బెళగల్: పోలీస్ సిబ్బంది, మహిళా కానిస్టేబుళ్ల గ్రామాలపై నిఘా పెంచాలని ఎస్‌ఐ పీరయ్య అన్నారు. బుధవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది గ్రామాలలో రెగ్యులర్ పర్యటించి గ్రామంలో ప్రజల సమస్యలను గుర్తించాలన్నారు. అదే విధంగా పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికపై నిఘా ఉంచి, ఎప్పటికి అప్పుడు సమాచారంను తమకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. పల్లెలో ప్రస్తుతం నెలకొన్న వివాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హుండీ కానుకల లెక్కింపు వాయిదా

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో కొలువైన గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీ దేవి దేవాలయంలో బుధవారం చేపట్టవలసిన హుండీ కానుకల లెక్కింపు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆయా ఆలయ అధికారులతో సమావేశం కారణంగా హుండీల లెక్కింపు జరుపలేక పోయామని, తొందరలోనే తేదీని ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

యూనిఫాంను తప్పనిసరిగా ధరించాలి

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని శకునాల జెడ్పీ హెచ్ స్కూల్‌ను, బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, గుమ్మితం తండాలలోని ఎంపీపీ స్కూళ్లను సందర్శించారు. ఆయా పాఠశాలలోని ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. అలాగే అంగన్ వాడీ కేంద్రాలలో నాడు నేడు కింద జరుగుతున్న పనులు, చైల్డ్ ఇన్ఫో వివరాలు, జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు యూనిఫాం ధరించేలా చూడాలని ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ మల్లికార్జున, ఆయా పాఠశాలల హెచ్‌ఎం పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం గొందిపర్ల - వసంతనగర్ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ ప్రమీలాకుమారి కోడుమూరు మండలం పులకుర్తి పాఠశాలకు, ఉపాధ్యాయురాలు బేబీ సుజాత దేవనకొండ మండలం గుండ్లకొండ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం వసంతనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు హెచ్‌ఎం ప్రకాశ్‌రావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్‌కుమార్, ఉపాధ్యాయ బృందం శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర నాయకులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు మస్తాన్‌వలి, శ్రీనాథ్, పద్మావతి, మనోహర్ పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం 189 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు బుధవారం డ్యాం అధికారులు తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, జలాశయంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

ఎల్ఎన్‌జీ హబ్‌కు భూమి కేటాయిస్తాం



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఎల్ఎన్‌జీ హబ్ నిర్మాణం కోసం నగర శివారులో భూమి కేటాయిస్తామని జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ ఆధ్వర్యంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్(సీజీడీ) ప్రాజెక్టు జిల్లా స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ముందుగా ఐటీసీఎల్ జనరల్ మేనేజర్ జీవీ సత్యనారాయణ నేతృత్వంలో జిల్లాలోని సీజీడీ ప్రాజెక్టుపై క్లుప్తంగా ప్రదర్శన ఇచ్చారు. ఎల్ఎన్‌జీ హబ్, డీఆర్ఎస్ ప్రాజెక్టుల కోసం భూమిని కేటాయించాలని జేసీని కోరారు. అందుకు ఆమె స్పందించి భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాసు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆచార్యులు పాల్గొన్నారు.

పేదల చదువుకు భరోసా

- వరుసగా నాలుగో ఏడాది అమ్మఒడి నిధుల విడుదల
- బటన్ నొక్కి నగదు ఖాతాలో జమ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గడివేములలో 3931 మంది లబ్ధిదారులు

గడివేముల: పిల్లల చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. ఈ ఆలోచనతోనే అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. 2019-2020 విద్యాసంవత్సరం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో ఏటా ఆర్థిక సాయం జమ చేస్తున్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ఆయా గ్రామాల్లోని సచివాలయాలల్లో అర్హత సాధించిన వారి జాబితాను ప్రదర్శించారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు జమచేయడం జరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు అమ్మఒడి పథకాన్ని అమలు చేయడంపై విద్యార్థులు, తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల వారీగా లబ్ధిదారుల వివరాలు

మండలంలో అమ్మఒడికి 3,931 మంది తల్లులు అర్హత పొందారు. సీఎం చెప్పిన ప్రకారం డబ్బులు అకౌంట్లలో జమ కావడంతో తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బిలకలగూడూరు సచివాలయం పరిధిలో 488, బూజునూరు 297,చిందుకూరు 255 మంది లబ్ధిపొందారు. అలాగే దుర్వేశి 245, గడిగరేవుల 316. గడివేముల-1-278, గడివేముల-2-320, గని 195, కరిమద్దెల 353, కొరటమద్ది 168, కొర్రపోలూరు 226, మంచాలకట్ట 302, ఒండుట్ల 246, పెసరవాయి సచివాలయం పరిధిలో 242 లబ్ధిదారులు ఉన్నారు.



గడిగరేవుల జెడ్పీహైస్కూల్‌లో అమ్మఒడి కార్యక్రమాన్ని లైవ్‌లో తిలకిస్తున్న విద్యార్థులు

మాటనిలుపుకున్న సీఎం జగన్



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చి సీఎం జగన్ మాటనిలుపుకున్నారు. నా భర్త, నేను కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నా కుతూరు హరిణి స్థానిక ఎంపీపీ (స్పెషల్) పాఠశాలలో 2వ తరగతి చదువుతుంది. పేద కుటుంబంలో ఉన్న మాలాంటి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే సాధ్యం కాదు. జగనన్న అమ్మ ఒడి పథకంతో పేదపిల్లల ఉజ్వల భవిష్యత్‌కు జగనన్న మేనమామలా అండగా నిలవడం మా ఆదృష్టం.

-కొనేటీ సుజాత, కరిమద్దెల

పిల్లల చదువుకు ఉపయోగపడుతుంది



మా పిల్లల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నా కుమార్తె వర్షిత మా గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. మేము వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి డబ్బులు నా అకౌంట్‌లో రూ.13 వేలు జమ చేశారు. ఈ డబ్బులు పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడుతంది.

-వాసబోయిన ఆదిలక్ష్మి, గడిగరేవుల

భజన బృందాలకు అన్నదానం

గూడూరు రూరల్ : మండల పరిధిలోని చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వరస్వామి దేవాలయంలోని భజన బృందాలకు బుధవారం ఎంపీపీ సునీత, సర్పంచు వెంకటేశ్వరమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వరుణ దేవుడి కరుణ కోసం దేవాలయంలో సప్త భజన కార్యక్రమాన్ని భజన బృందాలు గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్నాయి. భజన బృందాల సేవ నిమిత్తం ఎంపీపీ, సర్పంచు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాన్ని కల్పించారు. వారు కూడా నాగలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు.

బకాయిలు ఇవ్వాలి

కల్లూరు: ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. బుధవారం ఉలిందకొండ సచివాలయం ఎదుట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గత 8 వారాలుగా పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు రాలేదన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుకు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చిల్లబండ గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను జేడీ రంగాలక్ష్మిదేవి

కోడుమూరు రూరల్ : ప్రజలకు అవసరమైన సేవలను అందించి వారి సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వే పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రంగాలక్ష్మిదేవి సచివాలయ సిబ్బంది, వలంటీర్లను హెచ్చరించారు. బుధవారం మండలంలోని అమడగుంట్ల, చిల్లబండ, వెంకటగిరి గ్రామాల్లో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి పర్యటించారు. జగనన్న సురక్ష సర్వేను, అభివృద్ధి పనులను పరిశీలించారు. జేడీ మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వేను ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్రతి గ్రామ సచివాలయంలో వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవసరమైన సేవల వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు, వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్, సచివాలయ సిబ్బందితో జేడీ సమీక్షించారు. ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు నిర్మాణం చేపట్టేలా చూడాల్సిన బాధ్యత ఆయా ఇంజినీరింగ్ అసిస్టెంట్లదేనని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లీలావతి, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏఈ లక్ష్మన్న తదితరులున్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్‌లో మండల ప్రత్యేకాధికారి శ్యామల, తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపీడీఓ రాముడు గ్రామంలోని మూడు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కలిగించారు. అదేవిధంగా గొల్లలదొడ్డి గ్రామ సచివాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ.. ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయం వ్యవహరించుకుని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, వారికి ప్రభుత్వం నుంచి అందిన సేవలు అందించాలన్నారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామానికి చెందిన సంపంగి వెంకటేశ్వరి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేశ్వరిని 11 ఏళ్ల కిందట పాణ్యం మండలం నందవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం చేశారు. కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తీసుకు రావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్తతో పాటు అత్త లక్ష్మమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అనారోగ్యంతో వాచ్‌మన్ మృతి

గడివేముల: మండల పరిధిలోని గని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వాచ్‌మెన్ మధు (30) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. 2015 నుంచి సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకున్న నంద్యాల ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ రవికుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీమన్నారణ, సహచర ఉద్యోగులు కరీం తదితరులు సంతాపం తెలిపారు.

పేదల భూములకు పట్టాలు ఇవ్వాలి

ఓర్వకల్లు : పదేళ్లుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మండలంలో పలు గ్రామాలలో సాగు చేసుకుంటున్న భూములను రామకృష్ణతో పాటు మండల కార్యదర్శి నాగన్న, సీఐటీయూ నాయకులు శ్రీధర్, మధుసూదన్ బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రాళ్లు, ముళ్ల పొదలు తొలగించి కొండలు, గుట్టలను చదును చేసి, లక్షలాది రూపాయలను ఖర్చుచేసి ప్రభుత్వ భూములను సాగు చేసుకున్నారని తెలిపారు. అలాంటి వారికి రాజకీయాలకు అతీతంగా సాగులో వున్న ప్రతి పేదవాడికి అసైన్డ్ కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు మాసూంబాషా, ఆంజనేయులు, బషీర్, దస్తగిరి, సంజీవ, రోషన్న తదితరులు పాల్గొన్నారు.

అందరూ గృహాలు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు ఇందిరమ్మ కాలనీ లేఅవుట్‌లో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు సర్వేనంబర్ 217 ఇందిరమ్మ కాలనీ లేఅవుట్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ లేఅవుట్‌లో సుమారుగా రెండువేల మంది పేదలకు ఇంటి స్థలం కేటాయించగా ఇప్పటికి 350 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. ఇప్పటికే కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు కావాలసిన మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ఇళ్లు నిర్మించుకుంటామనే లబ్ధిదారులకు అడ్వాన్స్‌గా రూ. 20వేలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్, కల్లూరు, కర్నూలు అర్బన్ తహసీల్దార్లు టీవీ రమేష్‌బాబు, విజయశ్రీ, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, విక్రమసింహారెడ్డి, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు శివ శంకర్‌రెడ్డి, హౌసింగ్ ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు

కల్లూరు : 2022-23 విద్యాసంవత్సరానికి గాను జగనన్న ఆణిముత్యాలు కింద ఎంపికైన రవీంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థిని అక్షరను బుధవారం ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

సంక్షేమ పథకాలు చరిత్రాత్మకం

పాణ్యం: దేశ చరిత్రలోనే సంక్షేమ పథకాల అమలు శాశ్వతంగా నిలిచిపోతుందని సచివాలయాల మండల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పాణ్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర చేయని విధంగా వలంటీర్ల వ్యవస్థ సచివాలయాల ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రంగనాథ్, బొచ్చు రవి తదితరులు పాల్గొన్నారు.

తాతా బాగున్నావా.. పింఛన్ అందుతోందా..

- ప్రతి గడపలో ఎమ్మెల్యే కాటసాని ఆత్మీయ పలకరింపు
- సమస్యలను నమోదు చేయించి పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు
- గడిగరేవులలో రెండో రోజు కొనసాగిన 'గడప గడపకు మనప్రభుత్వం'



మంచానికే పరిమితమైన వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

గడివేముల: తాతా బాగున్నావా..అవ్వ సకాలంలో పింఛన్ అందుతోందా.. అక్కా, తమ్ముడు, అమ్మ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకం అందిందా అంటూ నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. మండల పరిధిలోని గడిగరేవుల సచివాలయం పరిధిలో రెండోరోజు బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని సమస్యలు ఉంటే నమోదు చేయించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగేళ్లలో ప్రభుత్వం 95 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే దృష్టికి రైతులు పొలాల సమస్యలను తీసుకురాగా, పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరరప్ప, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, భోగేశ్వరం చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాషా, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పనులు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

కల్లూరు: అడిగిన వారందరికీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా) పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో జరుగుతున్న ఉపా ధి హామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. జాబ్ కార్డు ఉన్నవారందరూ పని రోజులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులలో కూలీల సంఖ్యను పెంచాలని మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధిరిని శ్యామల ఆదేశించారు. బుధవారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, డ్వామా ఏపీడీ అల్లిపీర, మండల ఉపాధిహామీ అధికారులతో కలిసి ఆయన ఉపాధి పనులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన డీడీ మాట్లాడుతూ.. మండలంలో రోజువారీ కూలీల సంఖ్య పెంచాలని, జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి పనులను పూర్తి చేయాలన్నారు. కాగా పనులలో కూలీల వివరాలను, పనుల ఫోటోలను అప్‌లోడ్ చేయడంలో మేటీలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

షెడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



ఆర్.ఖానాపురంలో షెడ్డు పనులను పరిశీలిస్తున్న ఏపీడీ అల్లీపీరా

గూడూరు రూరల్ : మండల పరిధిలోని ఆర్.ఖానాపురం నిర్మాణంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర షెడ్డును బుదవారం ఏపీడీ అల్లీపీరా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన షెడ్డును పూర్తి చేయించాలన్నారు. అవసరమైన నిధులను కేటాయించినా షెడ్డు ఏర్పాటులో ఆలస్యం జరుగుతుందని, వెంటనే పనులను వేగవంతం చేసి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వం 100 శాతం సబ్సిడీని ఇస్తుందని చెప్పారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపు ముందుకు వచ్చే రైతు పొలాల్లో గుంతలు తవ్వించి పండ్ల మొక్కలను నాటించాలని సూచించారు. ఈ ఏడాది 150 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు అయ్యేలా సిబ్బంది ప్రయత్నించాలని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ హసీనా ఉన్నారు.

గ్రామాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి



కంబదహాల్‌లో అక్రమ లే అవుట్‌లో ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

సి.బెళగల్: పల్లెలను పరిశుభ్రపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కూలీలు, గ్రామాల ప్రజలు శ్రద్ధ వహించాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, మంచినీటి నిర్వహణను పరిశీలించి ఆయా గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. మంచినీటి నిర్వహణ, సరఫరా తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రధాన దారి వెంట ఉన్న చెత్తను తొలగించి, చెత్త సేకరణ కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకొవాలని పీఎస్ ఖాజావలిని ఆదేశించారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు తప్పవు

గ్రామాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములలో లే అవుట్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈఓఆర్డీ సందీప్ హెచ్చరించారు. మండలంలోని కంబదహాల్ గ్రామంలో ప్రధాన రహదారిలో పంట భూములలో అక్రమంగా వెంచర్ వేయడంపై గ్రామస్తులు ఫిర్యాదులు చేయడంతో బుధవారం ఆయన లే అవుట్‌ను సందర్శించారు. అక్కడ వేసిన హద్దుల రాళ్లను పంచాయతీ కార్యదర్శి అభిషేక్‌తో తొలగించారు.

చిన్నపిల్లలకు సమయానుసారం వ్యాక్సిన్ ఇవ్వాలి



మందులను పరిశీలిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఏఎన్ఎంలు తమ పరిధిలోని చిన్నారులందరికీ సమయానుసారం వ్యాక్సిన్ అందజేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం పెద్దపాడు సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు, పిల్లలకు అందించాల్సిన వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్ నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. రోటా, ఎంఆర్ వ్యాక్సిన్‌లను వంద శాతం చిన్నారులకు ఇవ్వాలని సూచించారు. గర్భిణులు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని, గర్భిణులలో ప్రమాదకర చిహ్నాలు గుర్తించి వారిని కాన్పు తేదీకి మూడు రోజుల ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలని, ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్ఎం రోజుకు కనీసం ఐదు ఐడీలు జనరేట్ చేయాలని ఆదేశించారు. మాతాశిశు ఆరోగ్య భద్రతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కిల్కారి ఆరోగ్య సేవలను మొబైల్ వాయిస్ కాల్ ద్వారా ఇస్తున్నట్లు తెలిపారు. గర్భిణీ, బాలింతలు పాటించాల్సిన ఆరోగ్య నియమాల గురించి 01244588000 నంబర్ నుంచి వాయిస్ కాల్ ఒక నిమిషం 30 సెకండ్ల పాటు వస్తుందని, ఒక వేల ఫోన్ ఎత్తడం మిస్ అయితే ఆ సందేశాన్ని వినాలంటే 14423 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చని తెలిపారు. అనంతరం యూపీహెచ్‌సీని తనిఖీ చేసి ల్యాబ్, మందుల స్టాక్, గర్భిణుల రికార్డులను ఆయన పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

పట్టుకోండి చూద్దాం!

పాణ్యం: మండల పరిధిలోని నూలమిల్లు వద్ద హైవే పక్కన మిల్లు నుంచి వస్తున్న వానరాలను శునకాలు వెంబడించాయి. దీంతో వానరాలు పరుగుతు తీసి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎక్కాయి. వానరాల కోసం స్తంభం వద్ద కుక్కలు దాదాపు గంటసేపు వేచి ఉన్నాయి. అటుగా వెళ్తున్న బాటసారులు శునకాలను తరిమికొట్టినా మళ్లీ వచ్చాయి. చివరకు చేసేదేమిలేక అక్కడి నుంచి వెళ్లిపోయాయి.



స్తంభం ఎక్కిన వానరాలు, కింద ఉన్న కుక్కలు

నీటి పొదుపునకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్

కోడుమూరు రూరల్ : నీటిని వృథా చేయకుండా పొదుపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ సూచించారు. బుధవారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న, ఈఓ అజయ్‌భాస్కర్‌తో కలిసి గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ వాటర్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా వాటర్ వర్కర్స్ పట్టణంలోని కాలనీల్లో మంచినీటి పైపులైన్ల లీకేజీలు, వాల్వ్‌లు రిపేర్లుంటే వెంటనే గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. అలాగే నీటిని క్లోరినేషన్ చేయడం, ట్యాంకులను ప్రతి 15రోజుల కోసారి శుభ్రం చేయాలన్నారు.

వరి సాగుకు సన్నద్ధం



కొండజుటూరులో సాగు చేస్తున్న వరి నారు

పాణ్యం: ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరో నెల రోజుల్లో వరి నాట్లు ప్రారంభమవుతాయని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. మండలంలో ఎస్సార్బీసీ ఆయకట్టు కింద సుమారు 4వేల హెక్టార్లు సాగవుతుంది. సాగునీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ఈ సారి కూడా వరి పంటనే వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొండజుటూరు, గోరుకల్లు, పాణ్యం, కొణిదేదు, ఆలమూరు, గోనవరం గ్రామాల్లో అధికంగా వరి సాగు చేస్తారు. రాయితీపై ఇచ్చిన జీలుగలను రైతులు సాగు చేశారు. 45రోజుల తర్వాత ఈ పంటలను పొలంలో కలియదున్నిన తర్వాత వరి నాట్లు వేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో బోర్ల కింద కూడా వరి నాట్లు వేసేందుకు సన్నహాలు చేస్తున్నారు.